మంగమ్మ అల్లుడు

సుందరమ్మ కాస్త దూరాన ఉండగానే చూచి "రా, వదినా, రా" అని పిలిచింది మంగమ్మ.

సుందరమ్మ ముసిముసి నవ్వులు నవ్వుకొంటూ వచ్చి కూర్చుని "ఏం వదినా, పోట్లాడుకొన్నారటగా కూతురూ, అల్లుడూనూ?" అని అడిగింది.

"అప్పుడే నీదాకా వచ్చిందీ?" అన్నది మంగమ్మ నవ్వుతూ.

నేను వినకూడదా ఏమిటి వదినా?" అన్నది సుందరమ్మ కాస్త కోపం తెచ్చుకొని!

క్షమాపణ కోరుతున్న కంఠంతో మంగమ్మ అన్నది "అదికాదు వదినా, నీవు వినకూడదని కాదు. ఇందులో తప్పు విషయం ఏముంది కాకపోయినా. అసలు నీకు ఈ విషయం ఎవరు చెప్పారూ అని?"

'నిన్న సాయంత్రం సూరమ్మ అత్తయ్య వచ్చిందటగా మీాయింటికి. ఆమెకేమో కాస్తో కూస్తో తెలిసి ఉంటుంది. సూరమ్మ అన్నది, కృష్ణుడూ. సత్యమ్మ మళ్ళీ పోట్లాడుకొన్నారూ అని! పడుచువాళ్ళ పోట్లాటలు వింటానికి ఎవరికైనా సరదాగానే ఉంటుంది. ఏమిటి సంగతి చెబుదూ?' అని అడిగింది సుందరమ్మ.

మంగమ్మ అన్నది, "ఏమో వదినా, ఏం పోట్లాటలో, ఏమి సంగతో నాకేమీా అర్థం కావటంలేదు. చిన్నతనంలో ఉన్నారుకదా, చిలకా గోరంకులలాగ ఉండరాదూ ఇద్ద

రూనూ! ఏదో ఒక విషయమై తగూ వస్తూనే ఉంటుంది వదినా వాళ్ళిద్దరికనీ!" ఇట్లా అని మంగమ్మ ఆశ్చర్యాన్ని ప్రకటించింది.

సుందరమ్మ నవ్వి, "ఏమంత పెద్దపోట్లాటలు కావుగా. సరదాగానే ఉంటవి. చెబుదు, సంగతేమిటో వింటాను, అన్నది.

రెండు మూడుసార్లు బ్రతిమిలాడించుకొన్న తరువాత మంగమ్మ అల్లుడి విషయమై ఇట్లాగ చెప్పింది:

"కృష్ణుడు సంగతి ఏమీ బాగుండలేదు వదినా. తను ఏదో ఆఫీసులో గుమాస్తాకదా, ఆపని ఏదో చూచుకో కూడదూ! ఎప్పుడూ దానికొంగు పట్టుకు తిరక్కపోతే! వంటఇంట్లోకి వెడితే వంటఇంట్లోకి! దొడ్లోకివెడితే దొడ్లోకి తయారు!" అని మళ్ళీ ఆశ్చర్యాన్ని ప్రకటించింది మంగమ్మ గారు.

ఇక్కడ తమాషా ఏమిటీ అంటే, కృష్ణుడు పెళ్ళాం కొంగుపట్టుకొని వంటఇంట్లోకి వెళ్ళటం బాగానే ఉంది, సుందరమ్మకు. దొడ్లోకి వెళ్ళటమే ఆమెకు విచిత్రంగా ఉంది. "దొడ్లోకికూడా ఎందుకమ్మా?"అని ఆశ్చర్యాన్ని పొందుతూ అడిగింది.

"దొడ్లోకి ఎర్రగన్నేరుపూలు ఉన్నవి. అవన్నీ కోసి దాని ఒళ్ళో పోస్తాడు! దానికెందుకమ్మా అన్నిపూలు! ఏదో నేనూ చూచీచూడనట్టు ఊరుకొంటాను చెప్పొద్దూ" అంటూ మంగమ్మ తన ఔదార్యాన్ని ప్రకటించింది.

మంగమ్మ ఉదారబుద్ధిని గుర్తించి మెచ్చుకొంటున్నదాని వలె సుందరమ్మ అన్నది, "అవునులే, నీకు ఈగొడవలన్నీ పట్టినయ్యి. నీ వంటేమో! పూజా పునస్కారాలేమో! వాటితోనే సరిపోతుంది నీకు. అది సరేగాని వదినా, అసలు సంగతి ఏమిటో చెబుదూ?"

"చెప్తా వదినా, తొందరపడతావేమి. ఏమైందీ అంటే అల్లుడు ఆఫీసునుంచి అయిదుగంటలకు వచ్చాడు వదినా. వచ్చి, సత్యం సత్యం అని పిలిచాడు. పేరుపెట్టే పిలుస్తాడుగా!"

"ఇప్పుడంతా అంతేగా వదినా!"

"సత్యం ,సత్యం అని పిలిస్తే ఈ సత్యభామ చప్పున పలకలేదమ్మా, అదీ వచ్చిన ఖర్మం ఇంతకూ!"

"ఎందుకు పలకలేదూ?"

"ఎట్లా పలుకుతుందమ్మా, తనేమో వాకిట్లో ఉండె! అమ్మాయి ఏమో నాదగ్గర వంటింట్లో కూర్చున్నదాయె! ఆమూల వీధి వాకిలీ, ఈమూల దొడ్డివాకిలీనూ!"

"ఇంకేం, పలకలేదని కోపం వచ్చింది కామాలు!"

"కోపం వచ్చిందమ్మా. అయితే కోపం ఎందుకు రావాలా అంటా! పిల్ల ఎక్కడో లోపల ఉండేమోనని కాస్త బిగ్గరగా పిలిస్తే తన సొమ్మేమిపోయింది వదినా? ఆమాత్రం తెలియక్కరలేదూ ఆ అబ్బాయికైనా! ఏం? చిన్నవాడా చితకవాడా, పాతికేళ్ళు పైకొచ్చినయిగదా! ఇంకోసంగతి వదినా, ఆ పిలవటం అయినా ఎట్లా పిలుస్తా డనుకొన్నావు. ఆ తమాషాకూడా చూడాలిసిందే. సత్యం,

సత్యం అని పిల్లికూనలాగ అంటాడమ్మా! అల్లాగ అంటే దగ్గరున్న వాళ్ళకే వినపడదుకదా, దానికేం వినబడుతుందమ్మా! వినపడక పలకలేదు. విని పలకకపోవటం కాదుగా! ఆ సంగతి గ్రహించుకోవద్దూ! గ్రహించుకోక కోపంతో తలుపు తాతామని కొట్టాడు, ఇంట్లో వాళ్ళంతా హడిలిపోయేలాగున."

"సత్తెమ్మకు అప్పటికీ వినపడలేదా ఏం ఖర్మం?" అని అడిగింది సుందరమ్మ.

"వినపడ్డదమ్మా. వినపడ్డ వెంటనే పరిగెత్తుకుంటూ వెళ్ళిందమ్మా! బిడ్డ వెళ్ళి నవ్వుతూ 'ఏమండీ ఇందరాళ్ళే వచ్చారే, ఇవ్వాళ!' అంటూ తలుపు తీసిందమ్మా మామూలుగానే! పాపం, దానికేం తెలుసు-అప్పటికే ఆయన కడుపులో ఆలోచనలన్నీ ఉన్నయ్యని!"

"ఏమి ఆలోచనలమ్మా?"

"చెప్తానుండు. అప్పుడు ఏమైంది అనుకొన్నావు వదినా, నీవు చెపితే నమ్మవుగాని, నేను నిజంగా, అట్లా అవుతుందనుకోలేదు. తలుపు వెంటనే తియ్యలేదని కోపం వస్తేమటుకూ, ఎంతసేపు ఉండాలమ్మా ఆకోపం?"

"ఆలూ మొగులమధ్య, కోపం అరనిమిషం. అంతకంటే ఎక్కువ ఉండకూడదు!"

"అట్లాగ అయితే ఇంకా అనుకోవలసిందేముంది! అయ్యో, అయ్యో, ఏమైంది అనుకున్నావు వదినా, అమ్మాయి తలుపుతీసిందా, అల్లుడు రోజులాగ కాక కొత్త కొత్తగా చూస్తూ, సత్యాన్ని మాట్లాడించనైనా మాట్లాడించ

కుండా తన ఆఫీసు గదిలోకి బుసలు కొట్టుకుంటూ వెళ్ళిపోయి నాడమ్మా !''

కృష్ణుడు అల్లాగ వెళ్ళటం చాలా విచిత్రమైన ప్రవర్తన మటుకూ అవును అన్నట్లు సుందరమ్మ చూచి ఆశ్చర్యస్తబ్ధమైన కంఠంతో అడిగింది. ''ఎందుకు వెళ్ళాడు వదినా అల్లాగూ ?''అని.

మంగమ్మ ఉత్సుకతతో చెప్పింది – ''తలుపు వెంటనే తియ్యలేదనేగా, తనకు కోపం. పోనీ అడగకూడదూ, 'ఏమే సత్యామ్, ఏంజేస్తున్నావు లోపల ? ఎందుకు తలుపు తీయ లేదు' అని అడగకూడదటమ్మా ! అడిగితే చెప్పేదేగా''

స్నేహమార్దవమైన హృదయంతో 'అడగనే లేదా !' అన్నది సుందరమ్మ.

మంగమ్మ కౌతుకంతో చెప్పింది, ''అడగనూ లేదు, పెట్టనూ లేదు వదినా. అయ్యగారు మూతి మూరెడు చేసికొని, గదిలోకి వెళ్ళి, తలుపు తాక్కున వేసికొన్నాడమ్మా!''

ఈ మాటలు విని సుందరమ్మ ముక్కుపై వేలేసుకొని ఆశ్చర్యాన్ని ప్రకటించింది.

మంగమ్మ వ్యథితకంఠంతో చెప్పూకుపోయింది, ''నిజం మాటకు దాని తప్పేముంది చెప్పూ. ఆయన ఆఫీసునుంచి వస్తాడు. వచ్చేటప్పటికల్లా కాఫీ, ఫలహారమూ తయా చెయ్యాలనేగా అమ్మాయి తొందరపడుతున్నది. తనకి ం మధ్యాహ్నంనుంచి అది సతమతం అవుతున్నదని ఆం కేం తెలుసు ! ఏమైందనుకొన్నావు వదినా, సమయానికి ఇంట్లో సెనగపిండి లేకపోయిందమ్మాయ్ ! లేకపోతే మ్మాయి

ఏం జేసిందనుకొన్నావు వదినా, దాని తెలివితేటలకు చెబుతాను. అప్పటి కప్పుడు అప్పిని బ్రతిమిలాడి, బజారుకు పంపించి, పిండి తెప్పించి బజ్జీలు వండించింది. తనకోసమేగా ఈ అవస్థఅంతా! ఈ సంగతి కాస్త గ్రహింపు ఉండా లంటావా?"

"ఉండొద్దుటమ్మా...ఈ మగవాళ్ళకు ఉండేలక్షణమే అల్లాంటిది లే. నేను ఎరగనా ఏమిటి! అవతలవాళ్ళు తమ కోసం ఎంత ఇదై పోతున్నారో చూడరమ్మోయ్! మగవాళ్ళకు ఆమాత్రం గ్రహింపు ఉంటే ఇంకా అనుకోవలసిందేముంది? సరేగాని, ఇంతకూ అల్లుడు ఏంజేశాడు చెప్పవూ?"

"ఏంజేశాడా, మా సత్యవతివంక కొఱకొఱా చూచి వెళ్ళిపోయినాడు. సత్యాం ఏమీమాట్లాడలేదు. గదిలోకి వెళ్ళి తలుపు వేసుకున్నాడమ్మా, మాటా లేదూ, పలుకూ లేదు."

సుందరమ్మ మంగమ్మ మాటకు అడ్డొచ్చి "అల్లుడు ఆ తరువాత ఏంజేశాడో చెప్పవమ్మా ఊరికే చంపక," అన్నది విసుగుతో.

"అదికాదు వదినా, కాస్తకూ కూస్తకూ మొగవాడు ఇల్లాగ ముడుచుకుపోతుంటే ఆడది కాపరం చెయ్యటం కష్టము. ఏమంటావు?" అని అడిగింది మంగమ్మ.

అల్లాంటి మగవాళ్ళతో కాపరం చెయ్యటం చాలా కష్టమనీ ఆ మంగమ్మ కూతురుకాంగా ఓపిగ్గా కాపరం చేస్తున్నదనీ సుందరమ్మ వచ్చినట్లు ఒప్పుకొన్న తరువాత మంగమ్మ మళ్ళీ ఇల్లాగ చెప్పింది:

"ఆయన గారికి కోపం వచ్చిందని దీనికి తెలిసిందే అనుకో, తెలిస్తే మటుకు ఏంజేస్తుంది వదినా? మగవాళ్ళకు కోపం వచ్చినప్పుడు కాసేపు మాట్లాడకుండా ఉంటే అదే పోతుంది అనుకొన్నదమ్మా. అనుకొని ఊరుకొన్నది. ఊరు కోటం తప్పా అయిందమ్మా మళ్ళీ !"

"ఊరుకోక ఏంజెయ్యాలె వదినా. ఓహోహో ఊరు కోటం కూడా తప్పు అయితే ఎట్లాగమ్మా."

"అదేనమ్మా వదినా, ఊరుకోకూడదట. ఏదో ఇంగ్లీషుతో అనాలెటమ్మా! ఏదో చెప్పింది. నాకు రాదు చచ్చి! క్యాజుక్యాజు అనాలటమ్మా! ఎందుకూ అల్లాగ అనటం! ఎక్కడైనా విన్నామా! ఎప్పుడైనా ఎరుగుదుమా మనము! నలభై ఏండ్లు మొగుడితో కాపరం చేశాను నేను, ఎప్పుడూ అనలేదు వదినా అల్లాంటిమాటలు!" మంగమ్మ వ్యధిత కంఠంతో ఈ సంగతి చెప్పి, కళ్ళనీళ్ళు పెట్టుకొన్నది. సుందరమ్మ చూపవలసిన సానుభూతి చూపిన తరువాత తృప్తిపడి మళ్ళీ ఇట్లాగ చెప్పింది:

"ఛీ ఛీ, అల్లాంటి మాటలు చేసుకొన్న మొగుడితో అంటారా! ఎవరో అప్రాశ్చ్యులు అనుకోవలసినమాటలు! ఆ మాట అనాలటమ్మా! ఆ మాట అనలేదని ఆయనగారు మూతి మూరెడు చేసుకొన్నాడు." అని మంగమ్మ కళ్ళనీళ్ళు తుడుచుకొన్నది.

సుందరమ్మ సానుభూతి సూచకమైన ఒక నిట్టూర్పు విడిచి "అయ్యో, అయ్యో, ఇదెక్కడి విడ్డూర్యం. అది సరే

కాని, పోనీ అనలేక పోయిందా ఆమాట కాస్త! అంటే దీని నోటి ముత్యాలేమి రాలిపోతయ్యా?" అన్నది.

"అనలేకపోయిందా అంటే, ఒక టొచ్చింది. పోనీ అనవే అమ్మాయీ, ఆయన ఏది అనమంటే, అదే అను అమ్మా, ఎందుకొచ్చిన తగూలివి, అని నేనూ చెప్పాన మ్మాయ్. వచ్చిన ఖర్మం ఏమిటి అంటే, ఆసమయానికి దానికి ఆమాట జ్ఞాపకమే లేదో, తోచనే లేదో, ఏదో అయింది. ఇంతకూ లేచిన వేళ మంచిది కాదనుకో! ఇదమ్మా కారణం, ఇక ఆయన మండిపోయినాడు వదినా, చెపితే నమ్ముతావో నమ్మవో కాని, ఆయన కోసం ఇంతా అంతా కాదు. కొఱ కొఱా చూశాడు దాన్ని కొఱుక్కు తినేట్టు?"

సుందరమ్మ పరిహాస మార్దవమైన కంఠంతో చిరునవ్వు నవ్వుతూ, "కొఱుక్క మానాడా, ఎందుకు అనకపోవాలె ఈ భడవా" అన్నది.

వినతి పూర్వకమైన కంఠంతో మంగమ్మ అన్నది. "చెప్పాను గదటమ్మా ఆ సమయానికి తోచలేదని! నీవూ ఆలాగే అయావేం వదినా? కొడుకుని వెనుకేసుకొస్తావు!"

"నీ కూతురు చేసినపని పొరపాటే అని ఒప్పుకోవాలె వదినా" అన్నది సుందరమ్మ.

అనురాగ సూచకమైన నిట్టూర్పు విడిచి మంగమ్మ అన్నది, "పోనీ నీవు అన్నట్లు పొరపాటే అయిందనుకో. ఆమాట అనలేదు తప్పే! అనకపోతే ఎందుకు అనలేదు అని అడగాలా? అడిగితే కారణం చెప్పేదిగా! అడక్కుండానే,

సంగతేమిటో తెలిసికోకుండానే మురుచుకుపోతే ఎల్లాగమ్మా కాపరం చేసేది! ఏమంటావు?"

ఇల్లాగ మంగమ్మ కచ్చితంగా అడిగేసరికి సుందరమ్మ పరమసత్యాన్ని దాచలేక "నిజమే మరి ఎద్దైనా తప్పుఉంటే, ఎందుకిట్లా చేశావూ అని అడగాలె, దండించాలె, ఆ మాట నిజమే" అని ఒప్పుకొన్నది.

మంగమ్మ మళ్ళీ తనకూతురుకు జరిగిన అన్యాయాన్ని గూర్చి చెప్పింది మనస్సులోని సంతోషాన్ని గాంభీర్యమనే అనకుంఠనంతో సాధ్యమైనంతవరకు కప్పిపుచ్చి 'అడగటం లేదు, పెట్టటం లేదు! అల్లాగ పడకకుర్చీలో పడుకొని ఊరుకున్నాడు. సత్యవతి హడలిపోయింది వదినా. నాతో అన్నదమ్మా బిడ్డ. తలుపు వెంటనే తీయకపోతే ఆయన పాపం వీధివాకిట్లో చాలాసేపు నుంచున్నారు. అప్పుడు నేను ఆమాట అనాలె అమ్మాఅని! అల్లాగ అనాలెనని ఆయన చాలాసార్లు చెప్పారుకూడా! సమయానికి తోచక అనలేదే అమ్మా అని ఊరికే గిలగిల్లాడిందమ్మా బిడ్డ!'

ఇల్లాగ చెప్పి మంగమ్మ ఒక్క-నిమిషం ఊరుకొంది. ఆమె మనస్సులో చాలా బాధపడుతున్నట్లు సుందరమ్మ గ్రహించాలె. ఆమె గ్రహించిందో లేదో తెలిసికొంటానికే ఆమె ఆగింది.

సుందరమ్మ కళ్ళు పెద్దవిచేసి, ఇంత అన్యాయం ఎక్కడా చూడనట్టు ఆశ్చర్యాన్ని ప్రకటించిన తరువాత, మంగమ్మ మళ్ళీ కథ ఎత్తుకున్నది.

"నేను చెప్పేది, ఆయన అల్లాగ ముడుచుకు పోకపోతే ఏమమ్మా! పిల్లగానిదే తప్పు అనుకో. అదేదో అనవలసిన మాట చిన్నసన్యాసి అనకపోతే ఒకటికి నాలుగుసార్లు చెప్పి అనిపించుకోవాలెగాని ఇల్లాగైతే ఎల్లాగు వదినా!"

'ఆమాటా నిజమే. నాలుగుసార్లు చెప్పాలిసింది. చెప్పినా, అనకపోతే 'భడవా, ఎందుకనలేదు ఇన్నిసార్లు చెప్పినా' అని అనవచ్చుగా!"

'అదే మొదలు వదినా, ఇక ఇద్దరికీ మాటలు లేవనుకో. నేనూ అనుకోలేదు వదినా, ఆయన కడుపులో ఇంత ఉద్దేశాలు పెట్టుకొన్నాడని! ఏదో ఒక్కమాటకదా అది అనకపోతే, నాపిల్లను నానాఅల్లరీ చేస్తాడా?" ఆమె కళ్ళు చెమ్మగిల్లినవి.

సుందరమ్మ కరుణార్ద్రహృదయంతో, "ఏమి అల్లరి చేశాడు వదినా" అని అడిగింది

"అదీ చెప్తాగా వినరాదూ. బజ్జీలు చేశానా, అవి నాలుగు వెండిపళ్ళెంలో పెట్టి 'ఇచ్చిరావే అమ్మాయీ' అన్నాను. అది తీసికెళ్ళి ఇచ్చింది. వెధవది నవ్వు వస్తుంది. ఇస్తే బజ్జీలన్నీ తిన్నాడమ్మాయ్! పిల్ల మరికాసిని తీసికెళ్ళి వేస్తే మాటవరసకైనా అక్కరలేదు అనకుండా శుభ్రంగా తిన్నాడు! కాఫీకూడా తాగాడు. అప్పటికైనా కోపం పోవాలంటావా!"

ఈ ప్రశ్నకు సుందరమ్మ చటుక్కున జవాబు చెప్పేసింది, "కాఫీ తాగినతరువాత కూడా కోపం పోవకపోవటం తప్పే!"నని.

"కాఫీ తాగి మంచిబట్టలు వేసుకొని గబగబా నడిచి ఎక్కడికో వెళ్ళిపోయినాడమ్మా. అల్లుడు అల్లాగ వెళ్ళిపోయిన దగ్గరనుంచి పిల్ల ముఖం ఇంతజేసుకొని, కోపంతో రుసరుస లాడుతూ కూర్చున్నది."

"అల్లుడు తిట్టాడా తిమ్మాడా, ఎందుకూ ఈ పిల్లకు కోపం?" అని అడిగింది సుందరమ్మ.

మంగమ్మ మునిగడ్డంపై వేలువేసికొని "దీనికి కోపం ఎందుకూ అంటే, ఆయనేదో అనాలటమ్మా, ఆమాట అన లేదుట! అందుకని దీనికి కోపం వచ్చింది."

సుందరమ్మకు ఏమీ అర్థంకాలేదు. "ఏమి అనాలె వదినా! ఏమీ అనకపోతే నేం?" అని అడిగింది అమాయ కంగా.

"ఏదో అనాలెటె వదినా, నేను ఇప్పుడు నీకు ఏదైనా సాయం చేస్తానా, చేస్తే నీవు ఏదో అనాలటమ్మా. అదేదో అమ్మాయి చెప్పింది. థాంక్ అనాలెటమ్మా. అనక పోతేనేం వదినా ఆమాట! ఆమాట అనలేదని దీనికి పుట్టెడంతకోపము వచ్చిందమ్మా."

"బాగానే ఉంది ఇద్దరూ ఇద్దరే" అని సుందరమ్మ విస్తుపోయింది.

"దీనిదగ్గరా ఉన్నదమ్మా, కాకపోయినా పోనీలేవే, ఊరుకో, అంటే ఊరుకుండా, ఊరికే గుంజుకొన్నది! ఇప్పుడు నీవు వదినా, నాలుగు అప్పడాలు కాస్తవత్తిపెట్టమంటావు! నేను వత్తిపెడతా ననుకో. ఆపళంగా నన్ను పట్టుకొని,

తాంక్, తాంక్ అని నీవు అంటున్నావా? ఎందుకు వదినా అల్లాగ అనటము, నాకు తెలయక అడుగుతాను."

సుందరమ్మకు మటుకు ఏం తెలుసు, ఎందుకు ఆమాట అనాలో? అయినా తెలివిగలది కాబట్టి కాస్త ఆలోచించి, అదేదో ఆమాట కాస్త ఆ పిల్లవాడు అనకపోవటం తప్పేనని తన అభిప్రాయాన్ని తెలియపరిచింది.

ఆ తరువాత మంగమ్మ సుందరమ్మ ఈ విషయమై చాలాసేపు మాట్లాడుకొని ఇద్దరివల్లా తప్పు ఉందని నిర్ణయించారు.

అప్పుడు మంగమ్మ ఆ సంభాషణ ఇల్లాగ ముగించింది. "ఎవరిని ఏమనీ లాభం లేదమ్మా తలుపు ఆలస్యంగా తీసినపుడు ఇది అనాలిసినమాటలు అనలేదని ఆయనకు కోపం వచ్చింది. ఫలహారం పెట్టినపుడు ఆయన అనాలిసిన మాటలు అనలేదని దీనికి కోపం వచ్చింది. ఇల్లాగ పెరిగింది వదినా వ్యవహారం."

ఆ తరువాత మంగమ్మ నిస్పృహతో ఒక నిట్టూర్పు విడిచి "అనాలిసిన మాటలు ఏమైనా ఉంటే ఎప్పటివి అప్పుడు అనేసెయ్యాలే తల్లీ అని నేను నెత్తిని నోరుపెట్టుకొని మొత్తుకొన్నా అది వినకపోయె! ఎట్లా చచ్చేదమ్మా, నేను ఏంజేసేది!" అని మంగమ్మ ఈ వ్యవహారంలో తనతప్పు ఏమీ లేదని గోల పెట్టింది.

తనతప్పు లేకపోవటమే కాకుండా తన కూతురు తప్పు కూడా ఆ ఓటే లేదనే మంగమ్మ అంతరంగిక భావము. అందుచేతనే అన్నది చివరకు.

"ఇప్పుడు నేను చెప్పేది ఏమిటీ అంటే అది చిన్న సన్యాసి ఏదో అనలేను అనేగా తనకు కోపం వచ్చింది. పెద్ద వాడుగదా తను అనాలిసినవి మటుకు తను అన్నాడా ఎందుకు అనలేదూ అంటా ?"

భార్యా భర్తల ప్రవర్తనలో అల్లుడితప్పే కాస్త ఎక్కువగా ఉన్నదని సుందరమ్మ ఒప్పుకొని చివరకు ఈ తగా యిదా ఏవిధంగా పరిష్కారం అయిందో చెప్పమని కోరింది. అప్పుడు మంగమ్మగారు ఇల్లాగ చెప్పింది.

"అప్పుడేంచేశా నావదినా, ఇంతలోకే ప్రొద్దుకూకింది. అమ్మాయికి తలదువ్వి వాలుజడవేసి మల్లెపూలు పెట్టాను. ఆపళంగా నేను వంటఇంట్లోకి వెళ్ళిపోయినా నమ్మా.

అమ్మాయి అయినా ఏమీ కోపంగా లేదు. ఆయన వచ్చేసరికి ముఖం ముడుచుకొని ఉంటే వ్యవహారం అంతే చెడుతుంది, నవ్వుతూ కనపడమ్మా అని నేను చెప్పి వెళ్ళి పోయినాను.

దానికైనా నా కాస్త తెలుసువదినా, మొన్న పండుగకు అల్లుడు తెల్లటి గ్లాస్కో-చీర కొన్నాడు లే. చాలా బాగుం టుంది. అదే కట్టుకున్నది. కుంకుమరంగు పట్టురెవిక జరీపేటు వేసింది తొడిగింది.

వదినా నిజం చెపుతానూ; అమ్మాయి బంగారు తల్లి లాగా తయారు ఉయింది. నాతల్లిని చూస్తే కడుపు నిండిం దమ్మా. వెధవది అనుకోకూడదు తల్లి దృష్టికూడా తగులు తుంది.

"పెళ్ళాన్ని చూచి కోపం అంతా మరిచిపోయినాడా అల్లుడు ?" అని అడిగింది సుందరమ్మ.

అదేనమ్మా, అల్లాగ మరచిపోయే మనిషి అయితే ఇంకా అనుకోవటసిందేముంది, అందరి నోళ్ళలో పడటం ఎందుకొస్తుంది. ఆయనా మరిచిపోలేదు, అదీ మరిచిపోలేదు, రాత్రి ఎనిమిదిగంటలకు వచ్చాడమ్మా అల్లుడు. బైటికి ఏమీ అనకపోబట్టి కోపం పోయిందేమో అనుకొన్నాను వెఱ్ఱి బాగులదాన్ని. కడుపులో పెట్టుకొన్నాడు వదినా! పెట్టుకొని మాట్లాడకుండా స్నానంచేశాడు అమ్మాయే స్నానానికి నీళ్ళు ఇచ్చింది. ఇదెంత గడుసుదో చూచావా? పోనీ ఆయన మాట్లాడించకపోతే తానుఅయినా మాట్లాడించ కూడదూ, అఁహా, అదీ మూతి బిగించుకొన్నది. ఆయనా బిగించుకొన్నాడు."

మొగుడూ పెళ్ళాలు ఈ విధంగా మూతులు బిగించుకొని ఒకరితో నొకరు మాట్లాడకుండా ఉండటానికి కారణం వాళ్ళకు కోపాలు పోకపోవటమేనని సుందరమ్మ కనిపెట్టి చెప్పేసింది.

మంగమ్మ ఆ అభిప్రాయంతో ఏకీభవించి అన్నది, 'అదేవదినా నేను చెప్పొచ్చేది. కోపాలుపోందే! రోజూ ఇద్దరూ ఒకపంక్తినే కూర్చుని భోజనంచేసేవాళ్ళా, ఆరోజు అమ్మాయి ఆవైపుకే రాలేదమ్మా. ఆయన తిన్నతరువాత తింటానన్నది. పోనీ ఆయన అయినా పిలవకూడదూ, అఁహా. ఆయనా పిలవలేదు.'

'ఇద్దరికీ పట్టుదలలు వచ్చినవమ్మా.'

'అదే వదినా, పట్టుదలలు వచ్చినవి. ఒక్కమాట అయినా మాట్లాడకుండా ఆయన తిని వెళ్ళాడు. బంగాళా దుంపలకూర అదీ చేశాను. తినటంలో అలగలేదమ్మాయ్ అల్లుడు. అదీనయమే, ఆయన తరువాత అమ్మాయితిన్నది. మొగుడు అన్నం తింటూఉంటే అది ఆచాయలకు రాలేదమ్మా! కోపం! చూశావా దానికోపం!'

"కోపం, కోపంలా ఉంచుకోవాలె గాని పంక్తిని కూర్చొని భోజనం చెయ్యక పోవటం ఏమిటి! ఎవ్వరినీ అంటానికి వీలులేదమ్మా ఇద్దరూ ఇద్దరే." అన్నది సుందరమ్మ.

"అదేనమ్మా. ఏమైంది అనుకొన్నావు వదినా, భోజనాలు అయినాక పడుకోటానికి వెళ్ళారమ్మా. వీళ్ళ ఇళ్ళు బంగారంగానూ, తెల్లవార్లూ వీళ్ళు ఎక్కడ పోట్లాడుకొంటారో, ఎవరైనా వింటే నవ్విపోతారని నాకు గుండె గుబుక్ గుబుక్కు అన్నది. చెప్పద్దూ!"

"ఎవరి మంచంమీద వారు పడుకొని గప్‌చిప్‌గా నిద్ర పోయినారా?" అని అడిగింది సుందరమ్మ నవ్వుతూ.

"లేదు వదినా, అట్లా అయినా కొంతనయమే. నిద్ర పోందే! ఒకటే కీచులాట! ప్రొద్దుటినుంచి అణచిపెట్టుకొన్న కోపం అంతా పొంగటం సాగిందమ్మా! నీదే తప్పు అని ఆయన. మీకుమటుకు? అనీ ఇది. ఇదీవరుస! ఎట్లాగమ్మా! అప్పుడు నేను ఏం జేశాననుకొన్నావు. ఈ పిల్ల నిద్రపోదు,

తెల్ల వాళ్లూ ఇల్లాగ మాట్లాడుతునే ఉంటారని భయం వేసి, చెప్పొద్దూ, తలుపు తట్టానమ్మా! అమ్మాయి తలుపు తీసింది. ఏమిటి కిచులాట నాయనా, అని అల్లుణ్ణే అడిగాను, నాకు తెలిసినట్లు ఉండకూడదనుగా వాళ్ళు మొగుడూ పెళ్ళాల సంగతి! ఆయనే సంగతంతా చెప్పాడు. నాయనా, నాయనా నేను చెప్పినట్లు వినమని బ్రతిమిలాడి ఇద్దరినీ కూర్చోమని, ఎవరు అనాలిసిన మాటలు, వాళ్ళు అనండర్రా అని బ్రతిమి లాడి అనిపించేసరికి పది కొంగున కొట్టాను వదినా. అమ్మాయి క్యాజ్ క్యాజ్ సాక్ అన్నది. ఆయన ఏమన్నా థాంక్ థాంక్ అన్నాడు. దానితో ఇద్దరికీ రాజీ కుదిరింది వదినా

ఆ తరువాత నేను బైటికివచ్చి పడుకొని భజగోవింద కీర్తనలు పాడుకొంటూ ఉంటే ఏదో నవ్వుకోటం వినిపించింది. ఆ పోట్లాటలు ఏమిటో మళ్ళీ ఈ నవ్వులేమిటో. పోనీలే వాళ్ళ ఇష్టం నాకెందుకని నేను మాట్లాడలేదు చెప్పొద్దూ! అదీ సంగతి వదినా! ఇంత వ్యవహారం జరిగిందమ్మా!

సుందరమ్మ "చాలా గ్రంథం జరిగిందే" అని ఆశ్చర్య పడి, వెళ్ళిపోయింది.